అధికారులకు పట్టని అతిథి గృహాలు

- శిథిలావస్థలో పంచాయతీరాజ్ అతిథి గృహం
- నివాసయోగ్యంగా లేని ఆర్ అండ్ బీ అతిథి గృహం
- విలువైన కలప, సామగ్రి చోరుల పాలు


నిరుపయోగంగా ఉన్న పంచాయతీరాజ్ అతిథి గృహం


శిథిలమైన పంచాయతీ రాజ్ అతిథి గృహం కాపలాదారు నివాస గృహం

తిరువూరు: నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంతో సందడిగా ఉంటూ ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ అతిథి గృహాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా ఇవి మారాయనే ఆరోపణలు ఉన్నాయి.

20 ఏళ్లుగా కనీస మరమ్మతులు కరవే..

సుమారు 80 ఏళ్ల కిందట బ్రిటిష్ పాలనా కాలంలో తిరువూరులో నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహం శిథిలమై పోయింది. గతంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తిరువూరు విచ్చేసినప్పుడు ఈ అతిథిగృహంలో బస చేసేవారు. గత 20 ఏళ్లుగా మండల పరిషత్ అధికారులు ఈ అతిథి గృహానికి కనీస మరమ్మతులు కూడా చేయించకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. పై కప్పు విరిగిపోయి, తలుపులు, కిటికీలు చెదలు పట్టి పాడైపోయాయి. గతంలో ఈ అతిథి గృహానికి ఒక కాపలాదారును మండల పరిషత్ నియమించగా, ప్రస్తుతం ఎవరూ పట్టించుకునే దాఖలాలు లేవు. రాత్రి వేళ ఈ అతిథి గృహ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చుట్టుపక్కల నివాస గృహాల వారు ఆరోపిస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన పునర్నిర్మాణం..

శిథిలమైన పంచాయతీరాజ్ అతిథిగృహం పునర్నిర్మాణానికి మండల పరిషత్ పలుమార్లు పంపిన ప్రతిపాదనలు జిల్లా పరిషత్ అధికారుల అనుమతికి నోచుకోలేదు. రూ.80 లక్షలతో నూతన అతిథి గృహం నిర్మించడంతో పాటు దుకాణ సముదాయాన్ని నిర్మించాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా తీర్మానించారు. ప్రస్తుత పాలకవర్గం హయాంలో ఈ అతిథి గృహాన్ని తొలగించి పెట్రోల్ బంక్ ఏర్పాటుకు లీజుకు ఇవ్వాలని ప్రతిపాదించారు. తిరువూరు నడిబొడ్డున ఉన్న పంచాయతీ రాజ్ అతిథి గృహ ఆవరణను ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని పలువురు ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.

తాళాలు తీయని ఆర్ అండ్ బీ అతిథి గృహం

తిరువూరు కోకిలంపాడు రోడ్డులోని ఆర్ అండ్ బీ అతిథి గృహం కూడా గత పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఈ అతిథిగృహంలో నాలుగు సూట్లు ఉండగా గతంలో ఒక్కొక్క సూట్‌కు రోజుకు రూ.వెయ్యి చొప్పున అద్దె వచ్చేది. నెల రోజులు ముందుగా అతిథిగృహ సూట్లను అడ్వాన్స్ బుక్ చేయించుకునే పరిస్థితి ఉండేది. అనంతరం అధికారుల పర్యవేక్షణ లేక అతిథి గృహం లోపల చెదలు పట్టింది. అధికారులు స్పందించి అతిథి గృహానికి కనీస మరమ్మతులు చేయిస్తే తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రెడ్డిగూడెం: ముచ్చనపల్లి పంచాయతీ పరిధిలో అంటు వ్యాధులు ప్రబలకుండా డ్రెయినేజీలలో బ్లీచింగ్ చల్లించామని సర్పంచ్ దేవల జమలయ్య మంగళవారం తెలిపారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా డ్రెయినేజీలలో, నిల్వ ఉన్న మురుగు నీటిపై బ్లీచింగ్ చల్లించామన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



చాట్రాయి: మండలంలోని చిన్నంపేటలో ఇటీవల విష జ్వరాలు రావడంతో గ్రామంలో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేశారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అన్ని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల లార్వా దశను నిర్మూలించండి



చాట్రాయి: అంటు వ్యాధులు ప్రబలకుండా నిల్వ నీటిల్లో దోమల లార్వా పెరుగుదలను నిర్మూలించాలని ఎంటమాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ బీఎల్ఎస్ కుమార్ అన్నారు. మండలంలోని చీపురుగూడెంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ఇటీవల జ్వరాలు రావడంతో ఇంటింటా జ్వరాలపై సర్వే చేశారని, జ్వర పీడితులకు వైద్య సేవలందించామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సురేష్ కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మీ, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాద్, సీహెచ్ఓ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

మైలవరం: మైలవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి అధ్యక్షతన స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీఓ పి. శ్రీనివాస్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల మండల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

60 మందికి నేత్ర వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం: అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో జోజి, జెస్సీ దంపతుల సహకారంతో స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద మంగళవారం నేత్ర వైద్య శిబిరం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిబిరాన్ని రెడ్డిగూడెం ఎస్ఐ గోవింద్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆహార అలవాట్లలో జాగ్రత్తలు పాటించాలని, జీవన శైలి మార్చుకోవాలని సూచించారు. 60 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. కంటి వైద్యురాలు పల్లెపాం లక్ష్మీ కుమారి, అభ్యుదయ యువశక్తి సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు, సిరి ఆప్టికల్స్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నరసింహారావుపాలెం, సి గుడిపాడు, మర్లపాలెం, సోమవరం, కొత్తగూడెం గ్రామాల్లో కొత్త విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా చేయవలసిన త్రీఫేజ్ విద్యుత్‌ను బుధవారం తెల్లవారు జామున 4 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

ముమ్మరంగా డ్రెయినేజీ పూడికతీత పనులు


నూజివీడులో డ్రెయినేజీలో పూడిక తీత


మద్దులపర్వలో పూడికతీత పనులు చేస్తున్న పొక్లెయిన్

నూజివీడు: పట్టణంలోని డ్రెయినేజీల్లో పూడికతీత పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. డ్రెయినేజీలు పూడికతో నిండి కొద్దిపాటి వర్షానికే వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. డ్రెయినేజీలలో పూడికను తొలగించేందుకు మున్సిపల్ పాలకవర్గం రూ.30 లక్షల నిధులు కేటాయించి పనులను చేపట్టారు. చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి జంక్షన్ రోడ్డు వైపు, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి మైలవరం రోడ్డు వైపునకు పూడిక పనులను నిర్వహిస్తున్నారు. పూడిక తీస్తున్నందున మురుగు నిల్వ ఉండదని, ప్రజలు డ్రెయినేజీలో చెత్త వేయకుండా పురపాలక సంఘానికి సహకరించాలని చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రెడ్డిగూడెం: మద్దులపర్వ పంచాయతీలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని మండల విస్తరణాధికారి బి.శ్రీనివాస్ అన్నారు. పంచాయతీ అంతర్గత రోడ్లకు ఇరువైపులా కందకాలలో పూడిక తీయడం, మంచినీటి సరఫరా పథకాలు శుభ్రం చేయడం తదితర పనులను గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ వి. నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే మీరా పనులను పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులు ప్రకృతిని ప్రేమించాలి


మొక్కలు నాటిన ఉపాధ్యాయులు, విద్యార్థులు


నూజివీడులో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కాచవరం(ఇబ్రహీంపట్నం): ప్రకృతిని ప్రేమించడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని హిందీ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇర్ఫాన్‌పాషా అన్నారు. ఇర్ఫాన్‌పాషా సౌజన్యంతో రూ. రెండు వేల విలువైన వివిధ రకాల మొక్కలను స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ నూర్జహాన్ పర్యవేక్షణలో మంగళవారం నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతితో ఆహ్లాదం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. మొక్కల పెంపకంతో మానవాళికి అవసరమైన గాలి, ఆయుర్వేద ఔషధాలు లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, దొంతమాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **నూజివీడు:** విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సింహాద్రి వెంకట్ అన్నారు. నారాయణ స్కూల్‌లో మంగళవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి రక్షించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. పట్టణంలోని కోర్టు భవనాల హాల్‌లో మంగళవారం హెల్మెట్ ధారణపై న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి నాగశైలజ మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, దానిని ప్రతి ఒక్కరూ కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. రూ.10 వేలతో ఫోన్‌ను కొంటేనే అది పగలకుండా కవర్లు వేయిస్తున్నామని, ఎంతో విలువైన ప్రాణాన్ని కాపాడుకునేందుకు హెల్మెట్‌ను ధరిస్తే తప్పేంటని జడ్జి ప్రశ్నించారు. తల మీదేనని, రక్షణ కూడా మీదేనని, ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి రక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలను తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద్దఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


రాష్ట్ర సంచాలకులు శివప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా కోరారు. విజయవాడలోని సచివాలయ శాఖ రాష్ట్ర సంచాలకులు శివప్రసాద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు వివిధ శాఖల్లో పదోన్నతులు కల్పించాలని, ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని మాతృ సంస్థలకు అప్పగించాలని కోరారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం యువ ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలన్నారు. వన్‌టైమ్ ఆప్షన్ ద్వారా ఖాళీగా ఉన్న ప్రభుత్వ శాఖల్లో పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. మున్సిపాలిటీగా మారిన గ్రామ సచివాలయ ఉద్యోగులను వార్డు సచివాలయ ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి


దివ్యాంగ బాలికకు ఫిజియో థెరపీ చేస్తున్న దృశ్యం

ముసునూరు: దివ్యాంగ బాలలు ముందడుగు వేయాలంటే వారికి ఆదరణ అవసరమని హెచ్ఎం లోకరాజు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ బాబు, ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం


విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సు

ముసునూరు: విద్యార్థులకు బస్సు సర్వీసును ఏర్పాటు చేశామని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. మండలంలోని గుడిపాడు హైస్కూల్‌లో చదువుతున్న గుళ్లపూడి, వలసపల్లి విద్యార్థుల సౌకర్యం కోసం లోపూడి బస్సు సర్వీసును గుళ్లపూడి మీదుగా నడుపుతున్నామని చెప్పారు. నూజివీడు నుంచి లోపూడి వెళ్లే సర్వీసు మంగళవారం నుంచి గుళ్లపూడి, వలసపల్లి, గుడిపాడు చేరుకుని చెక్కపల్లి, రమణక్కపేట, ముక్కొల్లుపాడు మీదుగా నూజివీడుకు ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తుందని చెప్పారు. బస్సు సర్వీసు ఏర్పాటుతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి


ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఆర్డీఓ భవానీ శంకర్ తదితరులు

ఇబ్రహీంపట్నం: నది పరీవాహక గ్రామాల ప్రజలు ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ భవానీశంకర్ అన్నారు. వరద ముంపునకు గురైన సమయాల్లో చేపట్టాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చేపట్టిన ట్రయల్ రన్‌ను పవిత్ర సంగమం వద్ద మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో అవలంబించాల్సిన విధి విధానాలను తెలిపారు. వ్యక్తుల ప్రాణాలు, పశుసంపద, వ్యవసాయ పంట పొలాలు రక్షించుకునే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి దూరంగా పందుల తరలింపు

విస్సన్నపేట: గ్రామంలో నివాస ప్రాంతాల వద్ద సంచరిస్తున్న పందులను పంచాయతీ ఆధ్వర్యంలో పట్టించి దూరప్రాంతానికి తరలించామని సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి మంగళవారం తెలిపారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా పందులను గ్రామంలో తిరగకుండా చూడాలని పెంపకందారులకు పంచాయతీ నోటీసులు జారీ చేసిందన్నారు. అయినా గ్రామంలో పందులు తిరుగుతున్నాయని చెప్పారు. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పందులను పట్టించామని చెప్పారు.

విద్యార్థులకు సులభరీతిలో బోధించాలి

జగన్నాథపురం(వీరులపాడు): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో పాల్ కెనడీ పేర్కొన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18 నుంచి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తిరువూరు: మండలంలోని లక్ష్మీపురం పాలశీతల కేంద్రం వద్ద ఈ నెల 18 నుంచి అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు సహకారంతో ఈ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. అన్ని ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కానిస్టేబుల్ తిరుపతిరావుకు సన్మానం



తిరువూరు: దీర్ఘకాలం తిరువూరు పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ రైటర్‌గా పనిచేసిన తిరుపతిరావు బదిలీ అయిన సందర్భంగా మంగళవారం సిబ్బంది వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి సత్వర సేవలందించడమే కాక మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ తిరుపతిరావు పోలీసు శాఖలో ఆదర్శంగా నిలిచారని ఎస్ఐ సత్యనారాయణ అభినందించారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

సబ్సిడీ మొక్కలకు దరఖాస్తు చేసుకోండి



ఆగిరిపల్లి: రైతు సేవా కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక అన్నారు. మంగళవారం కనసానపల్లిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నూతనంగా మామిడి, నిమ్మ, కోకో, కొబ్బరి, ఆయిల్‌పామ్, కూరగాయ పంటలు వేసుకునే రైతులకు మొక్కలు సబ్సిడీపై అందిస్తున్నామని, అవసరమైన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాల ముంపు సమస్యకు చెక్



ముసునూరు: రహదారి మెరక కావడంతో పాఠశాల ప్రాంగణం లోతట్టుగా మారి ముంపునకు గురవుతోంది. గ్రామస్తుల చొరవతో ఈ సమస్యను పరిష్కరించామని సర్పంచ్ ముల్లంగి సుధారాణి తెలిపారు. సూరేపల్లి ఎంపీ మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం లోతట్టు కావడంతో కొద్దిపాటి వర్షానికే నీరు లోపలికి చేరి చిన్నారులకు ఇబ్బంది కలుగుతోంది. సర్పంచ్ చొరవతో గ్రామస్తులు పొన్నగంటి బుజ్జి, చల్లగుళ్ల నాగమల్లేశ్వరరావు పాఠశాల ఎదురుగా నీరు రాకుండా తూములు వేయించి సమస్యను పరిష్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు గురువారం విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, టెకో టాస్క్ సొల్యూషన్స్, యాక్సిస్ బ్యాంక్, మెడ్‌ప్లస్, ఓజోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్ తదితర కంపెనీలు ఈ మేళాలో పాల్గొని తమ కంపెనీలలోని ఖాళీలను భర్తీ చేస్తాయని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో పాటుగా ఐటీఐ పూర్తి చేసి 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు గల వారు ఈ మేళాలో పాల్గొనడానికి అర్హులని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటలకు జరిగే జాబ్‌మేళాకు నేరుగా హాజరు కావచ్చునని వివరించారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): రైతులు విత్తన ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ భవాని పేర్కొన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలో భూసార పరీక్షల ఫలితాలు, సమతుల ఎరువుల వాడకంపై రైతులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. ఆ ఫలితాల ప్రకారం విత్తన ఎంపిక చేసుకోవాలని తెలిపారు. సమతుల ఎరువుల వాడకంపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఇష్టారనుసారం ఎరువులు వాడటం వల్ల పంట నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే కో ఆర్డినేటర్ కృష్ణంరాజు, ఏఓ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: వ్యక్తి అదృశ్యంపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రేనిపాడుకు చెందిన పర్వతనేని వెంకట గోవర్ధన్‌కు ముగ్గురు కుమారులు. అతని రెండో కుమారుడు రామకృష్ణ సోమవారం రాత్రి 11.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద విచారణ చేసినా ఆచూకీ లభించలేదు. గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముసునూరు: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ పి. వాసు తెలిపిన వివరాల ప్రకారం.. వలసపల్లిలో తమ్మిలేరు ఇసుక ర్యాంపు నుంచి మంగళవారం అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. చిట్టిమాద రమేష్‌ను ట్రాక్టర్‌తో సహా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.